ప్రజాశక్తి

శనివారం 23 ఆగస్టు 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





సుదూరంలో మార్గదర్శులు

- బంగారు కుటుంబాలకు చేయూత కరువు
- ముందుకు రాని సంపన్నులు
- పి-4పై ఆసక్తి నామమాత్రం
- గుర్తించిన గృహాలు 3,038
- దత్తత గృహాలు 240 ● మార్గదర్శులు 84 మందే
- ఇంకా 2,798 గృహాల వారు ఎదురుచూపు





బంగారు కుటుంబాలు - 1

ప్రజాశక్తి - తిరువూరు : పభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బంగారు కుటుంబాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం ఇప్పట్లో నెరవేరేలా కనిపించడంలేదు. పి-4 భాగంగా ప్రభుత్వం గుర్తించిన కుటుంబాలకు మార్గదర్శులను అనుసంధానించడం ద్వారా ఆయా కుటుంబాలను పేదరికం నుండి బయటపడేయాలని ప్రణాళిక రూపొందించింది. అయితే ప్రభుత్వం రూపొందించిన ఈ ప్రణాళికకు అనుకున్న విధంగా స్పందన రావడంలేదు. పేద కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శులు ముందుకు రావడంలేదు. ప్రభుత్వ లక్ష్యానికి సుదూరంలో 'మార్గదర్శులు' ఉంటున్నారు. దీంతో గుర్తించిన బంగారు కుటుంబాలకు చేయూత కరువవుతోంది. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మండలంలో ఈ పథకంపై ప్రజాశక్తి క్షుణ్ణంగా పరిశీలన జరిపింది. అమలు తీరును అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యానికీ, క్షేత్రస్థాయిలో పథకం అమలు తీరుకీ ఏమాత్రం సంబంధంలేదని స్పష్టమవుతోంది. నింగికీ, నేలకూ ఉన్నంత దూరం కనిపిస్తోంది. తిరువూరు పట్టణంతోపాటు మండలంలోని 16 సచివాలయాల పరిధిలో మొత్తం 3,038 పేదల గృహాలు ఉన్నట్లు గుర్తించారు. బంగారు కుటుంబాల పథకం కింద 8,379 కుటుంబాలు అర్హమైనవిగా అధికారులు ఎంపిక చేశారు. అయితే 240 గృహాలకు చెందిన పేదలను మాత్రమే 84 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. అంటే మొత్తం లక్ష్యంలో 7.90 శాతం కుటుంబాలకే మార్గదర్శులు ముందుకు వచ్చారు. ఇంకా మిగిలిన 2,798 గృహాలు అంటే 92.10 శాతం కుటుంబాల వారికి దిక్కూమొక్కూలేకుండా పోయింది. మండలంలోని రోలుపడి గ్రామంలో ఒక్క మార్గదర్శి కూడా ముందుకు రాలేదు. తిరువూరు పట్టణం మినహా మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయానికి అత్యధికంగా ఆరుగురు, అత్యల్పంగా ఒకరు మాత్రమే మార్గదర్శులు అంగీకారం తెలిపారు. రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కొత్తపల్లి జవహర్ తిరువూరు మండలం గానుగపాడు గ్రామానికి చెందిన వారు కావడంతో ఆయన నెలలో ఐదారు సార్లు ఆ గ్రామానికి వస్తారు. రెండు మూడు రోజులు ఉండి వెళుతుంటారు. అయినా ఆ గ్రామంలో అధిక సంఖ్యలో ఉన్న పేదలను దత్తత తీసుకోవడానికి ఇద్దరు మార్గదర్శులు మాత్రమే ముందుకు రావడం విశేషం. దత్తత తీసుకున్న కుటుంబాలకు సంక్షేమం, అభివృద్ధి ద్వారా మార్గదర్శులు ఎలాంటి చేయూత అందిస్తారో ఇంకా తెలియదుగానీ మిగిలిపోయిన 2,798 గృహాల వారు మాత్రం తమకు ఎప్పుడు ఈ పథకం అమలవుతుందోనని ఎదురుచూపులు చేస్తున్నారు.

అధికారులు ఒకటికి రెండు మూడుసార్లు కొంతమంది సంపన్నులను (మార్గదర్శులు) బతి మిలాడుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. పి 4 విధానం ప్రకారం సంపదలో ఉన్నత స్థితిలో ఉన్న వారిలో 10 శాతం మంది అట్టడుగున ఉన్న వారిలో 20 శాతం మంది పేదలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం అధికారులు పడరాని పాట్లు పాడుతున్నారు. సంపద అధికంగా ఉన్న కుటుంబాలు తిరువూరు మండలంలో తక్కువ మంది ఉండటం, వారు కూడా పేదలను ఆర్థికంగా అభివద్ధి చేసేందుకు ముందు రావటానికి వెనుకడుగు వేయడం జరుగుతోంది. వీరి వద్ద ఎంత సంపద ఉంటే అభివృద్ధికి పేదలను దత్తత తీసుకుంటున్నారనేదాన్ని పరిగణనలో తీసుకొని తమ ఆస్తులపై ప్రభుత్వం నిఘా పెడుతుందనే భయం సంపన్నులను వెంటాడుతోందని కొంతమంది (మిగతా 2లో)

సచివాలయం పేరు	గుర్తించిన గృహాలు	గుర్తించిన కుటుంబాలు	మార్గదర్శులు	దత్తత గృహాలు	మిగిలిన గృహాలు
1.ఆంజనేయపురం	96	202	1	2	94
2.చింతలపాడు	76	195	1	1	75
3.చౌటపల్లి	73	182	1	1	72
4.ఎర్రమాడు	63	187	5	14	49
5.గానుగపాడు	117	335	2	4	113
6.కాకర్ల	66	182	1	1	65
7.కోకిలంపాడు	60	155	3	6	54
8.కొమ్మిరెడ్డిపల్లి	83	204	1	6	77
9.జి.కొత్తూరు	115	265	2	3	112
10.లక్ష్మీపురం	67	153	6	6	61
11.మల్లెల	142	339	3	5	137
12.మునకుళ్ళ (2 ఉన్నాయి)	34	81	4	15	19
13.ముష్టికుంట్ల	59	148	1	1	58
14.రోలుపడి	224	690	0	0	224
15.వామకుంట్ల	81	198	2	2	79
16.వావిలాల	479	1594	5	18	461
17.తిరువూరు పట్టణం	1203	3269	46	155	1048
మొత్తం (16 సచివాలయాలు, తిరువూరు పట్టణం)	3,038	8,379	84	240	2,798



రాజధానిలో ఇక మౌలిక వసతులు

- రూ.904 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం
- అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌కు అనుమతి
- నేచురోపతి వైద్యాలయానికి నడింపాలెంలో భూమి కేటాయింపు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రూ.904 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. పురపాలక శాఖ ఆధ్వర్యంలో సిఆర్‌డిఎ పరిధిలో అమరావతి క్యాపిటల్ సిటీ, ఆంధ్రప్రదేశ్‌లో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ కింద గ్రామ పంచాయతీల్లోని ల్యాండ్ పూలింగ్ సిస్టమ్‌లో గల జోన్లలో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి, ఏడేళ్ల నిర్వహణ, రక్షణతో ఇంజినీరింగ్, అభివృద్ధి మౌలిక సదుపాయాల సదుపాయాల కోసం రూ.904.00 కోట్లకు ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. దీనివల్ల అమరావతి నిర్మాణ పనులు వేగవంతమయ్యేందుకు, మౌలిక (మిగతా 2లో)

స్వల్పంగా తగ్గిన కృష్ణా వరద

- ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 4,3,3398 క్యూసెక్కులు
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధతి స్వల్పంగా తగ్గింది. కాగా ఇన్ఫ్లో అవుట్ ఫ్లో 4,33,398 క్యూసెక్కులు కొనసాగుతున్న క్రమంలో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తున్నట్లు జల వనరుల శాఖ అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న బ్యారేజీకి 5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం కొనసాగిన సంగతి తెలిసిందే. ఎగువ రాష్ట్రాల జలాశయాల తోపాటు జిల్లాలోని వాగులు వంకల నుంచి వస్తున్న వరద ఉధతి తగ్గుముఖం పట్టడంతో బ్యారేజీకి వరద తాకిడి తగ్గింది. గురువారం 4.64 లక్షల క్యూసెక్కుల వరద ప్రవా హాన్ని సముద్రం తోపాటు డెల్టా కాలువలకి విడుదల చేశారు. శుక్రవారం (మిగతా 2లో)



యూరియా కోసం రైతుల పాట్లు

ప్రజాశక్తి - గన్నవరం : రైతే రాష్ట్రానికి వెన్నుముక అంటారు. ఆ రైతే పంట పొలానికి చల్లడానికి ఒక కట్ట యూరియా కోసం మండుటెండలో పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. కృష్ణాజిల్లా గన్నవరంలో శు క్రవారం ఈ పరిస్థితి చోటుచేసుకుంది. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు రైతులు యూరియా కోసం పడిగాపులు పడ్డారు. మండుటెండలో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో 21 గ్రామపంచాయతీలుంటే వాటి పరిధిలో 17 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రైతులందరికీ ఒకేసారి యూరియా అవసరమైంది. మార్కెట్లో దొరక్క పోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. కొద్దిగా స్టాక్ వస్తే దానిని ఎరువుల షాపు వారికి కేటాయించారు. రైతులంతా ఒకసారి ఎగబడ్డంతో అందరికీ అందని పరిస్థితి ఏర్పడింది. పిఎసిఎస్‌ల వద్ద ఇవ్వాల్సిన యూరియా ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్ద ఇవ్వటానికి గల కారణం అధికారులే చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా గ్రామాల్లో సొసైటీల ద్వారా యూరియా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.



యూరియా కోసం గన్నవరంలో బారులు తీరిన రైతులు

స్వల్పంగా తగ్గిన వరద

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 8 గంటల ప్రాంతంలో 4.38 లక్షల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో, రాత్రి 8 గంటలకు 4,33,398 క్యూసెక్కులకు చేరింది. ఇందులో 4,16,662 క్యూసెక్కుల మిగులు జలాలను బ్యారేజీ 69 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి సముద్రంలోకి విడుదల చేశారు. ఇందులో మిగిలిన 16,776 క్యూసెక్కులను డెల్టా కాలువలకు విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.5 అడుగులకు చేరింది. కృష్ణానది వరద ఉధతి కొనసాగుతున్న నేపథ్యంలో తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

మొదటిపేజీ తరువాయి

రాజధానిలో ఇక మౌలిక వసతులు

వసతుల కల్పన త్వరితగతిన చేపట్టేందుకు వీలు కలుగుతుందని చెబుతోంది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్, ఐబిఎం క్వాంటం కంప్యూటర్ ఇన్‌స్టాలేషన్‌కు ఐటి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుతో దేశంలోనే తొలిసారిగా ఒక క్వాంటం కంప్యూటర్ కలిగిన రాష్ట్రంగా ఏపి నిలుస్తుంది. ఔషధ ఆవిష్కరణ, వ్యవసాయం, పదార్థ శాస్త్రం, కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో విప్లవాత్మక సామర్థ్యాలను అందిస్తుందని చెబుతోంది. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు గ్లోబల్ భాగస్వాములతో కలిసి అత్యాధునిక పరిశోధనలు చేయగలుగుతాయని, కొత్త స్టార్టప్‌లు, పరిశ్రమలు, ప్రతిభావంతులైన యువతకు అవకాశాలు లభిస్తాయని అంటోంది. ఎపి సిఆర్‌డిఎ నుంచి రాజధాని ప్రాంతంలో ఐనవోలు, నీరుకొండలో ఇప్పటికే 150 ఎకరాల భూమి కొనుగోలు చేసి నిర్వహిస్తున్న విట్, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలకు అదనంగా మరో 100 ఎకరాల చొప్పున కేటాయించేందుకు గురువారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం తెలిపింది. ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలో రూ.5.18 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ యోగా అండ్ నేచురోపతి వైద్యాలయం ఏర్పాటుకు 12.96 ఎకరాల భూమిని కేటాయించేందుకూ ఆమోదం తెలిపింది. ఆయుష్‌శాఖకు ఈ భూమి బదాలయింపును ఆమోదించింది. రాయపూడిలో నూతనంగా నిర్మించిన ఎపి సిఆర్‌డిఎ కార్యాలయంలో నిర్మాణ సంబంధిత పనులు, ఇంటర్నల్ ఫినిషింగ్ వర్క్స్, బాహ్య అభివృద్ధి పనుల నిర్వహణకు రూ.160.00 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది.

సుదూరంలో మార్గదర్శులు

ఉద్యోగులు చెబుతున్నారు.

నిజమైన పేదలను గుర్తించే విధానం ఇదీ

ఇంటి యాజమాని పేరు, కుటుంబ సభ్యులు, వారిలో సంపాదన పరులు ఎంతమంది, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా నివసిస్తున్న ఇల్లు ఏ రకం, బ్యాంకు ఖాతా, పట్టణాల్లో స్థలం ఉందా, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయా, రక్షిత తాగునీరు సరఫరా అవుతుందా, ఇంట్లో గహెపకరణాల వివరాలు, వంటను గ్యాస్‌తో చేస్తున్నారా, కట్టెలతో చేస్తున్నారా, నెలకు కరెంటు బిల్లు ఎంత చెల్లి స్తున్నారు, గత రెండేళ్లలో ఆదాయపు పన్ను చెల్లించారా తదితర ప్రశ్నలతో సర్వే చేసి ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలి. దీని ప్రకారం తిరువూరు మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామాలు, మున్సిపాల్టీ ఆధ్వర్యంలో తిరువూరు పట్టణంలోని సచివాలయాలు గ్రామ సభల ద్వారా అట్టడుగున ఉన్న పేదలను అధికారులు గుర్తించారు.

దివి సీమతో పెనవేసుకున్న నేత

అధికార భాషా కమిషన్‌కు మండలి వెంకట కృష్ణారావు పేరు

ప్రజాశక్తి - అవనిగడ్డ : రాష్ట్ర అధికార భాషా కమిషన్‌కు కృష్ణాజిల్లా దివి ప్రాంతానికి చెందిన మండలి వెంకట కృష్ణారావు పేరు పెట్టడంపై కృష్ణాజిల్లావాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కృష్ణారావు పేరు పెట్టేందుకు ఆమోద ముద్ర వేసింది. దివిసీమ పేరు చెప్పగానే మొదట గుర్తుకు వచ్చే వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు. ఆయన 1926లో కొల్లేటి సీమలోని పల్లె వాడలో జన్మించారు. దివిసీమలోని నాగాయలంక మండలం భావదేవరపల్లి ఆయన స్వగ్రామం. అవనిగడ్డలో పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసి బందరు హిందూ కాలేజీలో పట్టభద్రులయ్యారు. 1942-45లో జాతీయ విద్యార్థి సంఘం అధ్యక్షులుగా ఉంటూ అజ్ఞాత స్వాతంత్ర పోరాటాల్లో కష్ణారావు పాల్గొన్నారు. పోలీసులు పట్టుకొని చిత్రహింసలు పెట్టి వదిలిపెట్టారు. 1946లో కష్ణారావు ఆంధ్ర విద్యార్థి పౌరసత్వ కళాశాలను ఆచార్య ఎన్జీరంగా ఆధ్వర్యంలో నిర్వహించారు. 1948లో జిల్లా యువజన కాంగ్రెస్ శిక్షణ శిబిరాన్ని కాంగ్రెస్ సేవాదళ శిబిరాన్ని నిర్వహించారు. 1950లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా కష్ణారావు యువజనలను సమీకరించారు. 1957-62లో కృష్ణారావు బందరు పార్లమెంట్ నియోజకవర్గం నుండి నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. మచిలీపట్నం పోర్టు అభివద్ధికి, ఇతర అభివద్ధి కార్యక్రమాలకు తోడ్పడ్డారు. 1963-69లో కష్ణారావు కష్ణాజిల్లా పరిషత్ ఉపాధ్యక్షులుగా, జిల్లా వ్యవసాయ అభివద్ధి సంఘ అధ్యక్షులుగా జిల్లా అంతటా పర్యటించి సమగ్ర అభివద్ధి పథకాలను తయారు చేశారు. 1967లో కష్ణారావు కోటిన్నర రూపాయల పెట్టుబడుతూ 11 వేల కుటుంబాలకు వత్తిని కల్పించేందుకు వీలుగా వ్యవసాయ బహత్తర ప్రణాళికలు ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిచే సెప్టెంబర్ 9న ప్రారంభించారు. 1969-72లో అవనిగడ్డ పంచాయతీ సమితి అధ్యక్షులుగా ఉండి అభివద్ధి కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రంలో రెండో స్థానం సాధించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా 1972 ఎన్నికల నిర్వహణలో కషి చేశారు. 1970లో జపాన్ మలేషియా ఫిలిప్స్ ఈశాన్య ఆశ దేశాలల్లో పర్యటించారు. 1972లో మండలి వెంకటకష్ణారావు అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీలేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీవీ నరసింహారావు మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమ మత్స్య పరిశ్రమ శాఖలను నిర్వహించి నూతన పథకాలను అనేక ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాల వసతి గహాలను ఏర్పాటు చేశారు. 1973లో సమైక్యాంధ్రలో మాత్రమే తెలుగుజాతి సమగ్ర అభివద్ధి సాధ్యమని తెలుగు ప్రజల శ్రేయస్సుకు తోడ్పడుతుందని విశ్వాసంతో కష్ణారావు ప్రత్యేక ఆంధ్రా ఉద్యమానికి వ్యతిరేకంగా నిలబడి, సమైక్యాంధ్ర కోసం తెలుగుజాతి ఐక్యత కోసం కషి చేశారు. 1974లో కష్ణారావు జలగం వెంగళరావు మంత్రివర్గంలో విద్యా సాంస్కృతిక వ్యవహారాల శాఖను నిర్వహించి విద్యాభివద్ధికి సాంస్కతిక వికాసానికి కృషి చేశారు. 1975లో కృష్ణారావు ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలను దిగ్విజయంగా నిర్వహించి తెలుగు ప్రజల నడుమ సమైక్యతను సహద్భావాన్ని పెంపొందించడానికి కషి చేశారు. 1976లో మారిషస్‌లో జరిగిన విశ్వ హిందీ సమ్మేళనంలో భారతీయ ప్రతినిధిగా పాల్గొన్నార. అక్కడ తెలుగు ప్రజలు నివసిస్తున్న వివిధ ప్రాంతాలలో పర్యటించి వారిలో నూతన ఉత్సాహాన్ని కలిగించారు. 1977లో కృష్ణానది ముఖద్వారంలోని దివి ప్రాంతాన్ని ఉప్పెన ముంచెత్తడంతో వేలాదిమంది ప్రజలు మత్యువాత పడ్డారు. లక్షలాది పశువులు, పదుల సంఖ్యలో గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఈ వినాశనానికి కారణమైన పెను తుపాను సంభవించినప్పుడు మండల వెంకట కష్ణారావు కాలినడకన గ్రామాలలో తిరిగి ప్రజలను ఓదార్చారు. తన మంత్రి పదవికి రాజీనామా ప్రకటించి పునరావాస చర్యలను చేపట్టి ప్రభుత్వ అధికారులను, స్వతంత్ర సేవా సంస్థలను సమన్వయపరచి సహాయ పునరావాస పునర్నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించారు. 1978లో వెంకట కష్ణారావు తిరిగి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1979లో ఉత్తమ సమాజ సేవకునిగా ప్రభాకర్ జి అవార్డు పొందారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల సంఘ సేవకుల సంఘానికి కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. స్వచ్ఛంద సేవా



సంస్థల కార్యక్రమాలను సమన్వయ పరిచారు. దక్షిణ భారత నిర్మాణ కార్యకర్తల సభలను గాంధీ క్షేత్రంలో నిర్వహించారు. 1981లో అంతర్జాతీయ తెలుగు సంస్థకు అధ్యక్షులుగా నియమితులై మలేషియాలో ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 1982లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి మంత్రివర్గంలో సహకార శాఖ మంత్రిగా నియమితులై వెంకట కష్ణారావు సహకార ఉద్యమాన్ని ప్రజల ఉద్యమంగా రూపొందించడానికి కషి చేశారు. 1997 సెప్టెంబర్ 27న ఆయనకి శ్వాస విడిచారు. తన యావజీవితాన్ని దివిసీమ అభివద్ధికి అంకితం చేసిన మండలి వెంకట కష్ణారావు శతజయంతి ఏడాది పొడవునా జరుపుకోవాలని నిశ్చయించుకొని ఆగస్టు 4వ తేదీ నుండి శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మండలి వెంకటకష్ణారావు పేరును అధికార భాషా కమిషన్‌కు పెట్టడం పట్ల దివిసీమలోని ఆయన అభిమానులు, తెలుగు భాష అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకోవాలని ఆటో కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-ఉయ్యూరు : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం)ఆధ్వర్యంలో శుక్రవారం ఉయ్యూరు ప్రధాన సెంటర్లో నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆటో వర్కర్లకు సంఘీభావంగా ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పోలి నాయుడు పాల్గొని ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిని కుటుంబాలను పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింది సంవత్సరానికి 25,000 వేల రూపాయలుఇచ్చి ఆదుకుంటామని చెప్పిన వాగ్దానాన్ని నెరవేర్చాలని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో ఇబ్బందులు పడుతున్నారని, అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్ పై విధించిన వ్యాట్ తగ్గించాలని ఆయన కోరారు. వాహన కొనుగోలుకి బ్యాంకుల ద్వారా నాలుగు లక్షల రూపాయలు సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని అన్నారు. సిఐటియు మండల కన్వీనర్ బి రాజేష్, ఆటో వర్కర్స్ మండల అధ్యక్షుడు ఎం పోతురాజు, ఎస్ ప్రభాకర్‌రావు, చంటి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, భాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఉచిత బస్సు సౌకర్యాల వలన తాము జీవనాన్ని కోల్పోయామని, ఆదుకోవాలని కోరుతూ గుడ్లవల్లేరు ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం బోసు బొమ్మ సెంటర్ నందుపురవీధుల్లో ర్యాలీగా బయలుదేరి మండల తాసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని తాసిల్దార్ బి లోకరాజుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గోట్రు కోటేశ్వరరావు, బోడపాటి జోషి, బి రాజ్ కుమార్, వంశీ ,రాము, కొండ, కళ్యాణరావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.


ఉయ్యూరులో...


గుడ్లవల్లేరులో...


దీక్షలో పాల్గొన్న ఎడ్లలంక గ్రామస్తులు

ఎడ్లలంకలో వరద బాధితుల నిరసన దీక్ష

ప్రజాశక్తి-అవనిగడ్డ : కృష్ణానది వరదలతో తమ గ్రామం పూర్తిగా నష్టానికి గురవుతోందని, నది కోతకి గురవుతూ తమ నివాసాలు నదిలో కొట్టుకు పోతున్నా ప్రభుత్వం ఎటువంటి న్యాయం చేయడం లేదంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. ఏళ్ల తరబడి వట్టి మాటలు చెబుతూ గ్రామం కోతకు గురికాకుండా ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదంటూ తమ గ్రామాన్ని రక్షించాలంటూ శిబిరంలో నినాదాలు చేశారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా తమను పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామస్తులకు వరదల నుండి రక్షణ కల్పించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలెపు సామ్రాజ్యంతో పాటు మాల మహానాడు జిల్లా కన్వీనర్ దోవ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్ల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన యువతకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్ శిక్షణను ఎస్సీ కార్పోరేషన్ సౌజన్యంతో ఇస్తున్నట్లు, దీనికోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్ సి కార్పొరేషన్ ఇంచార్జి కార్యనిర్వహక సంచాలకులు షాహిద్ బాబు షేక్ ప్రకటనలో తెలిపారు.ప్రతి అభ్యర్థికి శిక్షణకు అయ్యే ఖర్చు .20,వేలు లను ఎస్‌సి కార్పోరేషన్ భరించనుందన్నారు. జిల్లా నుండి 5 మంది పురుషులు మరియు 5 మంది మహిళలు సహా మొత్తం 10 మంది అభ్యర్ధులను జిల్లా కలెక్టరు ఆద్వర్యములోని కమిటీ వారి అర్హతల మెరకు ఎంపిక చేస్తుందన్నారు. దరఖాస్తుదారులు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ తీసుకుని కనీసం ఒక సంవత్సరం అయ్యి ఉండి, హెవీ డ్రైవింగ్ లెర్నర్ లైసెన్స్ కూడా ఉండాలన్నారు. కనీస వయస్సు 20 సంవత్సరాలు, 40 సంవత్సరములు దాటిన అభ్యర్థులు తప్పనిసరిగా మెడికల్ ఫిట్ నెస్ సమర్పించాలన్నారు. శిక్షణ వ్యవధి 40 రోజులు ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 21 నుండి 27 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కులధ్రువీకరణ పత్రం, ఆధార్, లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ నకళ్ళతో పూరించిన దరఖాస్తులను ఎస్‌సి కార్పోరేషన్, కష్ణాజిల్లా కార్యాలయంలో అందజేయలన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : డిఎస్‌పి


మాట్లాడుతున్న గుడివాడ డిఎస్‌పి వినీల్ ధీరజ్

ప్రజాశక్తి - గుడివాడ : వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు తప్పని సరిగా ఆన్‌లైన్‌లో పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో పర్మిషన్లు తీసుకోవాలని గుడివాడ పోలీసు డివిజనల్ అధికారి వినీల్ ధీరజ్ తెలిపారు. శుక్రవారం గుడివాడ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పట్టణ, రూరల్ సిఐలు శ్రీనివాస్, అనీష్, సోమేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ నాగరాజు, తాలుకా ఎస్ఐ చంటిబాబులతో కలసి ఆయన మాట్లాడారు. గణేష్ నిమజ్జనం సమయంలో డిజెలకు అనుమతి లేదన్నారు. పందిళ్ళు ఏర్పాటు చేసే వారు ప్రజలకు ఎంటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా సంఘటన జరిగితే దానికి పూర్తి బాధ్యత కమిటిపైనే ఉంటుందన్నారు. ఇతర మతాల వారికి, ప్రార్థన మందిరాలకు, ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు.

మచిలీపట్నం వెళ్ళే వాహనాలు దారి మళ్ళింపు

మచిలీపట్నం వెళ్ళే వాహనలు పెద్ద కాలువ సెంటర్‌లో నుండి దారి మళ్ళించి బిళ్ళపాడు మీదుగా వెళ్ళాలని వినీల్ ధీరజ్ తెలిపారు. గుడివాడ పెద్ద కాలువ సెంటర్ వద్ద రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిమిత్తం పెద్ద కాలువ సెంటర్ నుండి బందరు వైపు వెళు ్ళ రోడ్డు నుంచి దారిమళ్ళించినట్లు తెలిపారు. మచిలీపట్టణం వైపు వెళ్ళే వాహనాలు పెద్ద కాలువ సెంటర్ మీదుగా పామర్రు రోడ్డు, బిళ్ళపాడు రైల్వేగేట్, చిన్నఎరుకపాడు కొత్త బైపాస్‌రోడ్‌లో నుండి బొమ్ములూరు మీదుగా గుడ్లవల్లేరు వెళ్లాలన్నారు.

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే విగ్రహాలకు చట్టపరమైన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పమిడిముక్కల సర్కిల్ ఇన్స్పెక్టర్ వై. చిట్టి బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డీజే వంటివి నిషేధించాలని, మైక్ లైటింగ్ విద్యుత్ వాహకాల వల్ల ఎవరికి ఇబ్బంది కలగకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.**ప్రజాశక్తి-గన్నవరం :** పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే వారు ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలని సీఐ బి. వి శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణంలో అల్లర్లు ఘర్షణలకు అవకాశం ఇవ్వ కుండా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి జరిగిన వివిధ పరీక్షలలో ఉత్తీర్ణత పొంది ఉద్యోగాన్ని సాధించిన అభ్యర్థుల సర్టిఫికట్ల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణ సమావేశ హాలులో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అభ్యర్థుల భవిష్యత్ ఉద్యోగ జీవితానికి ఈ ధ్రువపత్రాల పరిశీలన అత్యంత ముఖ్యమని, పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడా సర్టిఫికేట్లు, కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలు సహా అన్ని అవసరమైన పత్రాలను సక్రమంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.అలాగే కానిస్టేబుల్ పదవికి ఎంపికైన అభ్యర్థులు భవిష్యత్తులో క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజాసేవ చేయాలని సూచించారు.

గన్నవరంలో మానవతా సంస్థ శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రపంచ శాంతి కోసం గన్నవరం గ్రామంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సేవా కార్యక్రమంలో భాగంగా కార్మికుడు చింతలపూడి వరప్రసాద్ ప్రమాదంలో గాయపడగా రెండు వేల రూపాయలు విలువ గల నిత్యవసర సరుకులు, వైద్య నిమిత్తం మందుల అవసరాల కొరకై మూడు వేల రూపాయలు నగదు అందించారు. తదుపరి శాంతి ర్యాలీని మానవతా కార్యాలయం వద్ద ప్రారంభించి బస్టాండ్ మీదగా కొత్తపేట సెంటర్ మరియు పోలీస్ స్టేషన్ మీదగా గాంధీ చౌక్ మీదుగా వెంకటేశ్వర థియేటర్ సెంటర్ మీదుగా నిర్వహించారు. ఛైర్మన్ మదుపల్లి బాలకష్ణమూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షులు వీసం ప్రసాదరావు, కోశాధికారి పొట్లూరి రామకష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


రైలు కింద పడి వ్యక్తి మృతి


మృతుడు (ఫైల్)

ప్రజాశక్తి - గుడివాడ : రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మతి చెందినట్లు రైల్వే ఎస్ఐ షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని దోసపాడు-ఇందుపల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు జేబులో దొరికిన ఐడి కార్డులో ఎస్ఎల్‌సి అనే కంపెనీలో పని చేస్తున్నట్లు, అతని పేరు కృష్ణమూర్తిగా ఉందన్నారు. మృతుడు ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే ఫోన్ నెంబర్ 9440627570కు సమాచారం అందించాలన్నారు.

గోనే సంచిలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం కంకటావ గ్రామంలో శుక్రవారం ఉదయం పొదల్లో అనుమానాస్పదంగా ఉన్న ఒక గోనె సంచిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సంచిని పరిశీలించగా, అందులో అదే గ్రామానికి చెందిన యజ్ఞ (37) అనే వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై గూడూరు ఎస్ ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



లైసెన్స్ లేని ఎరువుల షాపు యజమానిపై కేసు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మండలంలోని కలవపాముల గ్రామంలో లైసెన్స్ లేకుండా ఎరువులు విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులకు వ్యవ సాయశాఖ అధికారులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇటీవల ప్రారంభించిన ఎరువుల దుఖాణంలో యూరియా బ్లాకులో అమ్ముతున్నారన్న సమాచారం మేరకు వ్యవసాయశాఖ గన్నవరం అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్, మండల వ్యవసాయ శాఖ అధికారి నిస్సీగ్రేస్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ దుఖాణాన్ని తనిఖీచేయగా ఎరువులు విక్రయించేందుకు అవసరమైన లైసెన్స్ లేకపోవడం గమనించారు. లోపల ఉన్న ఎరువులు తనిఖీ చేయగా యూరియా నిల్వ లేకపోవడము గమనించారు. దీంతో దుఖాణంలో ఉన్న రూ. 1,32,000 విలువైన ఇతర ఎరువులు స్వాధీనం చేసుకుని యజమాని కుమార్ పై ఉయ్యూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసి కేసు నమోదు చేయించి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటిఐలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - గుడివాడ : ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబం ధించి కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ ,ప్రైవేటు ఐటిఐల్లో రెండవ విడత కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి ఆన్లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల కన్వీనర్/ప్రిన్సిపల్ ఓ.మంజులా దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రకటనలో 8,10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటిఐ.ఏపీ.జీవోవి.ఇన్‌లో దరఖాస్తులను ఈనెల 26వ తేదీ లోగా డౌన్లోడ్ చేసుకుని పూర్తిచేసి 27వ తేదీలోగా విద్యార్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఐటిఐ కాలేజీలలో చేరాలనుకునే వారు ఈనెల 29వ తేదీన కౌన్సెలింగ్‌కు హాజరు అవ్వాలని, అలాగే ప్రైవేట్ ఐటిఐ కాలేజీల్లో చేరాలి అనుకునే వారు ఈనెల 30వ తేదీన కౌన్సిలింగ్‌కు హాజరు అవ్వాల న్నారు. సందేహాలను నివత్తి కోసం గుడివాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలోని హెల్ప్ డెస్క్‌ని సంప్రదించాలని, 08674-295953, 8297574757, 9346118232 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

స్టేడియంలో వసతులు పెంచండి

- ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ

నగరపాలక సంస్థ స్టేడియంలో వసతులను పెంచాలని, పాతవి పాడైపోయిన ప్రమాదకరమైన బిల్డింగ్‌లను, రూములను సీజ్ చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులు ఆదేశించారు. బందర్ రోడ్డులోని దండమూడి రాజగోపాలరావు స్టేడియంను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్టేడియంలో ఆడుకునేందుకు వచ్చేవారికోసం మరింత వసతులు పెంచాలని, స్కెటింగ్ రింక్‌ను అభివద్ధి చేయాలని, పాతవి, పాడైపోయి, ప్రమాదకరమైన రూములను సీజ్ వేయాలని అధికారులను ఆదేశించారు. స్టేడియం ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని తెలిపారు.



రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానంద రెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గోల్డెన్ జూబ్లీ ఫెస్టివల్‌ను పురస్కరించుకొని ఆలిండియా ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ మెన్ టోర్నమెంట్ ఆగస్టు 17 నుండి 20 వరకు జరిగాయి. ఈ టోర్నీలో అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. పోటీల్లో హిందుస్థాన్ యూనివర్సిటీ చెన్నై టీమ్, లయోలా కాలేజ్ చెన్నై టీమ్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్లో హిందుస్థాన్ యూనివర్సిటీ చెన్నై టీం మొదటి స్థానం సాధించింది. ఈ సందర్భంగా హిందుస్థాన్ యూనివర్సిటీ చెన్నై టీమ్ సభ్యులు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఎపి స్టేట్ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి, వాణి ప్రసాద్‌ని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ టోర్నీలో పాల్గొనేందుకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



మత్తు పదార్థాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి- విజయవాడ

మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కృష్ణలంక ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విజయవాడ కృష్ణలంకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా ఈగల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ వీర ఆంజనేయులు మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను ఎవరైనా వినియోగించినట్లు తెలిస్తే తక్షణమే పోలీస్ వారికీ లేదా 1972కి సమాచారం అందిచాలని తెలిపారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడులో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని, అవసరమైన వారు ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరావు, పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై ప్రత్యేక తనిఖీలు

- కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ

యూరియా, ఇతర ఎరువుల సరఫరాపై నిరంతర నిఘాతో అప్రమత్తంగా ఉండాలని.. పక్కదోవ పట్టేందుకు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ప్రత్యేక బృందాలతో విస్తత తనిఖీలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు.ఎరువుల సరఫరాపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు సమద్ధిగా అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఎక్కడా పక్కదారి పట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రివర్యులు, సీఎస్ దిశానిర్దేశం చేశారు. కృత్రిమ కొరత సష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని.. పరిశ్రమలు, రవాణా శాఖల అధికారులతోనూ సమన్వయం చేసుకోవాలని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

స్టార్టప్, ఇన్నోవేషన్ రంగాలకు ప్రాధాన్యత

- ఎపిటిఎస్ ఎమ్‌డి సూర్యతేజ

ప్రజాశక్తి -విజయవాడ సిటీ

అద్భుతమైన యువశక్తి కలిగిన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా రూపుదిద్దుకోనుందని ఎపి టెక్నాలజికల్ సర్వీస్ (ఎపిటిఎస్) మేనేజింగ్ డైరెక్టర్ ఎం సూర్య తేజ అన్నారు. కోడ్ స్పార్క్ 2025 పేరుతో కేబీఎస్ కళాశాలలో జాతీయ స్థాయి హ్యాక్ తాన్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూర్యతేజ లాంఛనంగా హాక్‌తాన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక అవసరం అన్నారు. స్టార్టప్, ఇన్నోవేషన్ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ తరఫున త్వరలో హాక్‌తాన్ నిర్వహిస్తామని, అందులో ఉత్తమంగా నిలిచిన యువతరానికి ఎటువంటి టెండర్ పిలవకుండానే నేరుగా కోటి రూపాయల వరకు పెట్టుబడి పెట్టి స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఋషికొండలో స్టార్టప్ హబ్ ఏర్పాటు చేశామని, ప్రతి విద్యార్థి దానిని సందర్శించాలని కోరారు. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు సూచించే దిశగా స్టార్ టాప్‌లను ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి కష్ణవేణి, సెక్రటరీ టి శ్రీనివాసు, పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు అమ్రిత సాయి సరైన వేదిక కరస్పాండెంట్ రామ మోహనరావు

ప్రజాశక్తి-కంచికచర్ల

విద్యార్థుల ఉజ్జ్వల భవిష్యత్తుకు అమ్రిత సాయి సరైన వేదిక సెక్రటరీ, కరస్పాండెంట్ కె.రామ మోహనరావు అన్నారు. కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో గల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చేరిన విద్యార్థులకు మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రణాళికతోపాటు లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని, దానికి అనుగుణంగా నిరంతరం కషి చేయాలనీ తెలిపారు. కళాశాలలో ఉన్న అధునాతన ప్రయోగశాలల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిచుకోవాలని, తద్వారా విజయం సాధించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్.శశిధర్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న ఐఒటి, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ ఫోరెన్సిక్స్, బిగ్ డేటా, క్రిప్టో లాబ్స్ వంటి అడ్వాన్స్డ లాబ్స్ ద్వారా ఉత్తమ శిక్షణ ఇస్తున్నామని, తద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ హెడ్ డాక్టర్ చిరంజీవి, క్లబ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, సైన్స్ హ్యుమానిటీస్ విభాగాధిపతి డి.పవన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి గ్రూపునకు రుణాలివ్వాలి : ఎపిఎం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమైఖ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎపిఎం రామకృష్ణ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి గ్రూపునకు బ్యాంక్ రుణాలు అందేలా చూడాలి, రుణం తీసుకున్న ప్రతి సభ్యురాలకి ఆదాయభివద్ధి కార్యక్రమం ఉండేలా విఓఎలు చూడాలని సూచించారు. అలాగే స్త్రీ నిధి రుణాలు, ఉన్నతి రుణాలు, సిఐఎఫ్ రుణాలు అన్ని 100 శాతం రికవరీ జరిగేలా చూడాలి. అలాగే గ్రూపు సభ్యులు బ్యాంకు రుణాలు నేరుగా బ్యాంకు కౌంటర్‌లో మాత్రమే చెల్లించాలని సూచించారు.

ఇపిటిఎస్‌లో సమాచార నిక్షిప్తంపై దృష్టిపెట్టండి : కలెక్టర్

విజయవాడ : వివిధ శాఖలు, విభాగాల అంతర్గత పాలనా సామర్థ్యంతో పాటు నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) రూపొందించిన ఎంప్లాయీ పెర్‌ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ (ఇపిటిఎస్) పోర్టల్‌లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేయడంపై దష్టిపెట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఇపిటిఎస్ పోర్టల్‌లో సమాచారం అప్‌లోడ్ ప్రగతిపై కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారాన్ని https://epts.ap.gov.in పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

ఇన్సులిన్ ఇంజెక్షన్లకు వీడ్కోలు

- త్వరలో అందుబాటులోకి ఇన్సులిన్ ఇన్‌హెలర్లు
- డాక్టర్ సదాశివరావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

మధుమేహ వ్యాధిగ్రస్తులు ఇన్సులిన్ ఇంజెక్షన్ల బాధ నుంచి విముక్తి లభించనుందని, ఇన్సులిన్‌ను సులభంగా తీసుకునేందుకు వీలుగా ఇన్సులిన్ ఇన్‌హెల్లర్లు అందుబాటులోకి రానున్నాయని ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్, యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ (వైడీఆర్ఎఫ్) మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి సదాశివరావు తెలిపారు. మధుమేహ చికిత్సలకు సంబంధించిన ఆధునిక ఆవిష్కరణలు, నవీన చికిత్సా విధానాలపై చర్చించేందుకు వైడీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో డయాబ్ ఎండోకాన్ 2025 సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సదస్సు ఆగస్టు 24న లబ్బీపేటలోని హోటల్ జీఆర్టీ గ్రాండ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా సూర్యారావుపేటలోని ఆరిజన్ హాస్పిటల్లో



నిర్వహించిన మీడియా సమావేశంలో సదాశివరావు సదస్సు వివరాలను వెల్లడించారు. ఆధునిక వైద్య చికిత్సలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన ఇంజెక్షన్లతో స్వల్ప వ్యవధిలో 20 శాతం వరకు బరువు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైడీఆర్ఎఫ్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచి, సెక్రటరీ ఐశ్వర్య యలమంచి, జాయింట్ సెక్రటరీ అమూల్య యలమంచి డయాబ్ ఎండో కాన్ 2025 బ్రోచర్లను ఆవిష్కరించారు.

ఫ్రైడే డ్రై డేపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- విజయవాడ సిటీ

విజయవాడ నగరపాలక సంస్థ చేపట్టిన ఫ్రైడే డ్రై డేలో భాగంగా 50వ డివిజన్ పరిధిలోని మహంతిపురంలో దోమల నివారణకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దోమల పుట్టుక పరిణామం విషయాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. డివిజన్లో పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రజలు కాలువలలో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అప్పగించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వర్షాకాలం సందర్భంగా జ్వరాలు ఉధృతం అవుతున్న క్రమంలో ప్రాథమిక వైద్యశాల వైద్యులను సంప్రదించి తగు వైద్య సేవలు పొందాలని కోరారు.



ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, శానిటరీ సెక్రెటరీ ఎస్ఎం అలీ, హెల్త్ సెక్రటరీలు,ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది తదితరులు స్థానిక పెద్దలు రిజ్వాన్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోని కాలువ పూడిక పనులను కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు, 14వ వార్డు కౌన్సిలర్ ఉప్పతల గోపాలరావు శుక్రవారం పరిశీలించారు. ఆంజనేయ టవర్ హోండా షోరూం నందు ఉన్న గోడ సైడ్ కాలువలో పడడంతో గోడను తొలగించి కాలువ పూడిక పనులను పారిశుధ్య కార్మికులతో చేయించారు. ఈ కార్యక్రమం మున్సిపల్ సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మోటూరులో దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్ మండలంలోని పశువులను పోషించే లబ్ధిదారులకు పశువుల దాణా 50శాతం సబ్సీడీపై శుక్రవారం పంపిణీ చేసినట్లు మండల పశువైద్యాధికారి డా.వి.హనుమం తరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడతలో భాగంగా ఎస్‌సిఎస్‌పి కింద 50 కేజీలవి 220 బ్యాగ్స్ పశువులను పోషించే ఎస్‌సి లబ్ధిదారులకు ఇస్తున్నామన్నారు. మోటూరు, బొమ్ములూరు పశువైద్యశాలలకు వెళ్ళి సబ్సీడీని వినియోగించుకోవాలని కోరారు. మోటూరు పిఎసిఎస్ చైర్‌పర్సన్ చీకటి శేషగిరి రావు ద్వారా దాణా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఒక్కో బ్యాగ్ 1110 రూపాయలు కాగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై 555 రూపాయలకు పంపిణీ చేస్తున్నట్లు, దీనిని వినియోగించుకోవాలని కోరారు.

బార్ లైసెన్స్ దరఖాస్తుల్లో నిబంధనలో మార్పు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : జిల్లా ఎక్సైజ్ శాఖ బార్లు కేటాయించడానికి దరఖాస్తు చేసే ప్రక్రియలో ఏదైనా బార్ కేటాయింపు కోసం ఒకే ఒక్క దరఖాస్తు వస్తే ఆ దరఖాస్తుదారుడికి ఐదు లక్షల రూపాయల దరఖాస్తు రుసుము తిరిగి చెల్లిస్తామని కృష్ణాజిల్లా ఎక్సైజ్ ఉప పర్యవేక్షణ అధికారులు జి గంగాధర్‌రావు, చాగలమర్రి భార్గవ శుక్రవారం తెలిపారు. నాలుగు దరఖాస్తుల కంటే తక్కువ వచ్చిన బార్లకు లాటరీ తీయడం జరగదని, మళ్లీ వాయిదా వేస్తామన్నారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించాలని సూచించారు.


అవనిగడ్డలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం రైతుల బారులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఖరీఫ్లో రైతులకు యూరియా అందకపోవడంతో 30 మెట్రిక్ టన్నుల యూరియా అవనిగడ్డ మండలానికి రావడంతో ఇందుకోసం రైతులు ఆయా సెంటర్లలో యూరియా పొందేందుకు ఎగబడ్డారు. అవనిగడ్డ మండలంలోని అవనిగడ్డ పిఎసిఎస్‌కు 10 మెట్రిక్ టన్నులు, అశ్వరావు పాలెం రైతు భరోసా కేంద్రానికి పది మెట్రిక్ టన్నులు, వేకనూరు రైతు భరోసా కేంద్రానికి 10 మెట్రిక్ టన్నులు యూరియా రావడంతో రైతులు శుక్రవారం ఆయా ప్రాంతాల వద్ద యూరియా కోసం బారులు తీరి నుంచున్నారు. ఒక్కో రైతుకు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకువచ్చి చూపిస్తే రెండు బస్తాల యూరియా అందజేశారు. అయితే ఇప్పుడు సాగు చేసిన భూమికి మండలానికి సరఫరా అయిన యూరియా ఏమాత్రం సరిపోదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య హక్కుల కల్పనే 'స్వమిత్వ' లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గ్రామీణ ప్రాంతంలో సమగ్ర ఆస్తి ధ్రువీకరణ పరిష్కారాన్ని అందించడం స్వమిత్వ పథకం లక్ష్యం అని, జాగ్రత్తలు పాటిస్తూ సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి పెడన మండలం నేలకొండపల్లి, మడక గ్రామాలలో పర్యటించి స్వమిత్వ సర్వే పురోగతిని పరిశీలించారు. తొలుత ఆయన మండలంలో నేలకొండపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో స్వమిత్వ సర్వేకు సంబం ధించి సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లు, మ్యాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వేకు ముందు గ్రామసభలు నిర్వహించడంతో పాటు సంబంధిత ఇంటి యజమానికి నోటీసుల ద్వారా తెలియజేస్తున్నారా లేదా, సర్వేలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ఆయన అధికారులు, సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో



మాట్లాడుతూ గ్రామ కంఠాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలపై ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించడం స్వమిత్వ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జే అరుణ, భూ రికార్డులు ల్యాండ్ సర్వే ఏడి జోషిలా, తహసిల్దార్ అనిల్, సర్వేయర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

రైతుబజార్లో ప్లాస్టిక్ సంచులు నిషేధం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం రైతు బజార్లో ప్లాస్టిక్ సంచులు, క్యారీ బ్యాగులు వినియోగం నిషేధిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి లంకే బలిచక్రవర్తి తెలిపారు. శుక్రవారం రైతు బజారు స్వాగత ద్వారం వద్ద ప్లాస్టిక్ ని నిషేధిస్తూ బ్యానర్ ఆవిష్కరించి రైతులకు, కూరగాయల కొనుగోలుదారులకు చైతన్యం కల్పించారు. మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2 నాటికి పూర్తిగా ప్లాస్టిక్ వాడకం నిరోధిస్తామన్నారు. ప్రజలు కూరగాయలు కొనుక్కుని తీసుకెళ్లేందుకు ఇంటి వద్ద నుంచి గుడ్డ సంచులు తెచ్చుకోవాలన్నారు.

కెయులో క్వాంటమ్ వ్యాలీపై శిక్షణ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో కెయు ఇంజనీరింగ్ కళాశాలలో క్వాంటం వ్యాలీ నిపుణులచే క్వాంటమ్ హ్యాకతాన్ - 2025 పేరుతో శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డా. ఆర్ విజయ్ కుమారి పర్యవేక్షణలో డా. సల్మా బేగం సమన్వయకర్తగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల నుండి దాదాపు 100 మంది సిఎస్ఈ, ఈసీఈ విద్యార్థులు పాలుపంచుకున్నారు.

25 నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ సబ్ డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల25,26 తేదీలలో కోడూరు మండల పరిధిలోని వి కొత్తపాలెం, విశ్వనాథపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆటల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధి మునగాల ఉదయ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కూడా ఈ పోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఈనెల 25వ తేదీన అండర్ 17 విభాగంలో బాలురకు కబడ్డీ పోటీలు, అండర్ 14 ,17 విభాగాలలో చెస్ పోటీల తో పాటు 100 మీటర్లు, 800 మీటర్లు లాంగ్ జంప్ షార్ట్ కట్ డిస్కస్ త్రో విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా 26వ తేదీన బాలికల విభాగంలో అండర్ 17 కబడ్డీ అండర్ 14 17 విభాగాలలో చెస్ పోటీలతో పాటు 100 మీటర్లు 400 మీటర్లు లాంగ్ జంప్ షార్ట్ కట్ డిస్కస్త్రో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాల కోసం 970 44 63972,8106283732,9012627546 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు కడవకొల్లు నరసింహారావు జన్మదిన వేడుకలు అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నరసింహారావు కార్యాలయం వద్ద భారీ కేకు ఆయన చేత కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాల గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నరసింహారావుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి కోడూరు మండల పార్టీ అధ్యక్షులు పరిచే మాధవరావు, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు గరికపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి జంపాన మురళి, మాజీ సర్పంచ్ సైకం బాబురావు, మండల బూత్ కమిటీ కన్వీనర్ కొల్లాల మధుసూదన్‌రావు, దివి రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు రాజనాల మాణిక్యాలరావు, ఎంపీటీసీ లు గొ ళ్ల కష్ణకుమారి, తోట గణేష్ తో పాటు పలువురు అభిమానులు ఉన్నారు.


కేక్ కట్ చేస్తున్న నరసింహారావు

పక్కా ప్రణాళికతో నూరుశాతం ఉత్తీర్ణత

- అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం
- ప్రైవేటుకు ధీటుగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఆ అభ్యుదయ పాఠశాలకు లక్ష్య సాధనే ధ్యేయంగా ఉపాధ్యాయులు తమ టెన్త్ విద్యార్థులకు బోధిస్తున్నారు. వరుసగా టెన్త్‌లో విజయాలు సాధిస్తున్నారు. అంతే ఆ హైస్కూల్‌కు స్టేట్





పురస్కారం వరించింది. గుడ్లవల్లేరు మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందించారు. వరుసగా తమ హైస్కూల్ విద్యార్థులు ఏటా టెన్త్‌లో మంచి ఉత్తీర్ణతను కనబరచటంతో ఈ అవార్డును అందుకున్నారు. విద్యార్థులకు పాఠాలను శ్రద్ధగా బోధించే ఉపాధ్యాయుల కృషితో ఈ అవార్డు లభించింది. ఈ విజయం సాధించిన ఆ హైస్కూల్ హెచ్ఎమ్, ఎంఈఓ- 1 జి.జగన్మో హనరావు తో పాటు ఉపాధ్యాయులను ఎందరో అభినం దించి సన్మానించారు.

రాష్ట్రస్థాయిలో పురస్కారం లభించడం గర్వకారణం
జి.జగన్మోహనరావు, హైస్కూల్ హెచ్ఎమ్, గుడ్లవల్లేరు ఎంఈఓ-1



రాష్ట్రస్థాయిలో తమ హైస్కూల్ ఆదర్శం కావటం గర్వకారణంగా ఉంది. ఈ హైస్కూల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులు 74 మంది ఉత్తీర్ణులు అయ్యారు. వారిలో 71 మంది ఫస్ట్ క్లాస్ వచ్చారు. 571 మార్కులతో కతిజ తెహరా అనే విద్యార్థినికి సైనింగ్ స్టార్ అవార్డు సాధించింది. ఆ విద్యార్థిని తెహరా ట్రిపుల్ ఐటీకి కూడా ఎంపికైంది.

ఏటా టెన్త్ విద్యార్థులకు ప్రణాళిక ఇది...



- ప్రభుత్వ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యసాధనే ధ్యేయంగా పక్కా ప్రణాళికతో ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు ప్రత్యేక శిక్షణా తరగతులను అమలు చేయటం.
- ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించాలనే ముఖ్యోద్దేశ్యంతో విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా గ్రూపులుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహించటం.
- అలాగే విద్యార్థులకు జరిగే పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా గ్రూపులుగా విభజించి శిక్షణ ఇవ్వటం.
- కఠినంగా ఉన్న పాఠ్యాంశాల్లో తలెత్తే సమస్యలను ఉపాధ్యాయులు సులభతరంగా నివత్తి చేయటం.
- ప్రత్యేక తరగతుల సమయంలో గ్రూపులుగా విభజించి క్విజ్‌లు నిర్వహించటం.
- ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలకు జవాబులను ఎలా ఇవ్వాలో ఆయా సబ్జెక్టుల టీచర్లు అర్ధమయ్యే విధంగా చెప్పటం.
- ప్రతి ఉపాధ్యాయుడు పది మందిని దత్తత తీసుకుని వారికి వచ్చే సందేహాలు నివత్తి చేస్తూ ముందుకు తీసుకెళ్లడం.
- ముఖ్యంగా ఇంగ్లీషు, గణితంపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి అవసరమైన మెలకువలను నేర్పడం.

వెల్వడం సొసైటీ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-మైలవరం



మండలంలోని వెల్వడం సొసైటీ త్రిసభ్య కమిటీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రైతు శ్రేయస్సు ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చైర్మన్‌గా పురమా సతీష్, కమిటీ సభ్యులుగా గంజా ఆంజనేయులు, ప్రత్తిపాటి వినోద్‌రావు సొసైటీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సేవలు మెరుగుపరచాలి

ప్రజాశక్తి-వీరులపాడు

ఖాతాదారుల సేవలను మరింత మెరుగుపరచాలి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కిరణ్ బాబు తెలిపారు. వీరులపాడు మండలంలో వినియోగదారుల ఇండియన్ బ్యాంక్ ఖాతాదారుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో మండల వెలుగు ప్రాజెక్టు మేనేజర్ సత్తివేలు భూపతిరావు పాల్గొని మాట్లాడుతూ.. ఇండియన్ బ్యాంక్ ఖాతాదారులకు సేవలు వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు రెండు లక్షలకే మంజూరు చేస్తున్నారని, మూడు లక్షల వరకు పెంచాలని కోరారు. రైతుల అవసరాలు దృష్టిలో పెట్టుకొని కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : వైసిపి

ప్రజాశక్తి - తిరువూరు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టిడిపి కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాసు ఆరోపించారు. శుక్రవారం తిరువూరు పట్టణంలోని 12, 16 వార్డులలో బాబు షూరిటీ- - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు వందలాది హామీలిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం 2, 3 హామీలు మాత్రమే నామమాత్రంగా అమలు చేశారని తెలిపారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి పథకాల ఊసేలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు వైసిపి ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి కాలసాని గోపాల నాగేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, వరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, పాలం రమాదేవి, గుమ్మా వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలో ఉరి వేసుకున్న స్థితిలో ఓ వ్యక్తి మరణించి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో, ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో రోడ్లో నివాసముంటున్న బత్తుల దుర్గారావు (38)గా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయాలి

- యూనియన్ జిల్లా అధ్యక్షులు జ్యోతి

ప్రజాశక్తి-మైలవరం



ఈ నెల 26న మైలవరంలో నిర్వహిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి జ్యోతి పిలుపునిచ్చారు స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ మైలవరం మండల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ 6వ మహాసభ స్థానిక సీఎంఆర్ కన్వెన్షన్ హాల్లో జరుగుతుందని, మహాసభ జయప్రదానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాల వ్యవధిలో ఆశా కార్యకర్తలు జరిపిన పోరాట విజయాలపై చర్చించి భవిష్యత్తులో ప్రభుత్వాల అనుసరిస్తోన్న విధానాలపై పోరాటాలు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభకు ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కమల, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ హాజరవుతారని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సభ్యులు ఎస్ నాగమ్మ, స్వర్ణ, రాణి, సుజాత, చంద్రకళ, ప్రశాంతి, శారద, పాల్గొన్నారు .

యూరియా కోసం రైతుల పడిగాపులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

యూరియా కోసం రెడ్డిగూడెంలో రైతులు ఎరువుల షాపుల చుట్టూ తిరుగుతున్నారు. పూర్తి స్థాయిలో యూరియా అందుబాటులో లేకపోవడంతో గత మూడు రోజులుగా యూరియా కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. యూరియా కోసం తెల్లవారుజాము నుండే క్యూలైన్లో పడిగాపులు కాస్తున్నారు. దీంతో రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమ గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు : ఎఓ

మండలంలోని నాగులూరులో యూరియా అందుబాటులో ఉందని, అలాగే రెడ్డిగూడెం గ్రోమోర్‌లో ఉన్న యూరియాను అమ్ముకునేందుకు అనుమతి ఇస్తామని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అలాగే అవసరానికి అనుగుణంగా యూరియాను దిగుమతి చేసుకునేందుకు ఉన్నతాధికారులకు తెలియజేశామనీ, కొరత లేకుండా చూస్తామని తెలిపారు.

ఎరువుల దుఖాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు మండలంలో పెద్దవరం, వావిలాల గ్రామాల్లోని ఎరువుల షాపులను మండల వ్యవసాయ అధికారి పి.పద్మ శుక్రవారం తనిఖీ చేశా రు. యూరియా స్టాక్ ఉన్నా లేదని కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్‌పి ధరకు మించి అధిక ధరలకు అమ్మినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డులో నిల్వలు వెల్లడించాలని సూచించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని తెలిపారు.

సదరం సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్‌లో జరిగిన వికలాంగుల సదరం సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమంలో శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. అర్హుడైన ఏ ఒక్క వికలాంగుడికి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. ఎవరికైతే నిజమైన వికలాంగుడికి పింఛన్ ఆగిపోయిందో వారి వివరాలు తెలియజేయాలని తెలిపారు.

మోడీ గద్దె దిగాలని కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-మైలవరం



ఓట్ల చోరీతో గద్దెరెక్కిన ప్రధాని నరేంద్ర మోడీ గద్దె దిగాలని, ఎన్డీఏ కూటమికి సహకరిస్తున్న ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా మైలవరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలపై లేవనెత్తిన సందేహాలు ఆరోపణలకు ఎలక్షన్ కమిషన్ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం రామకృష్ణ, దోసపాటి గిరి కుమార్, పిట్టల నాగేశ్వరరావు, సుధాకర్, దూర రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన కలగుంట్ల విజయలక్ష్మి, గోల్లా కష్ణవేణి, షేక్ ఫాతే అహ్మద్, కొప్పు బ్లేస్సి, కలకంటి నాగరాజు, కలాలి పుల్లయ్య, గుంజి తిరుపతిరావు, షేక్ ఆలీ పాషా, కుంచపు శ్రీనివాసరావు, చింతకాయల శ్రీను, కమతాల హర్షిత్ వెంకట స్వాతి, పుట్టా జయదేవ్‌లకు వివిధ అనారోగ్య సమస్యల కారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స అనంతరం వచ్చిన బిల్లులను సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు చేయటం జరిగింది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5,00,654 విలువైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే రాజగోపాల్ తన నివాసంలో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టె నాగరాజు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు మల్లెల కొండయ్య, వేదులాపురి సైదా, పాల్గొన్నారు.

రైతులకు రుణాలు అందజేత

ప్రజాశక్తి -వత్సవాయి

మండలంలోని నవాబుపేట గ్రామంలో పిఎసిఎస్ సొసైటీలో ఐదుగురు రైతులకు రైతు నేస్తం ద్వారా మంజూరైన రూ.45 లక్షల రుణాలను సొసైటీ అధ్యక్షులు చింత వెంకటేశ్వర్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నంబూరు వెంకటేశ్వరరావు, గింజుపల్లి వెంకటయ్య, జాను ఆనంద్ రావు, సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు

ఎన్ఎస్‌పి కాల్వ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ


ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో కెవిఆర్ కాలేజ్ కాల్వకట్ట వద్ద నుంచి నేషనల్ హైవే 65 వరకు గల ఎన్ఎస్పి (నిర్దిష్ట సిల్ట్) కాల్వ పూడికతీత పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్పి కాల్వలో పూడికతీత పనులు పూర్తయితే వరదలు నివారించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, డిసి చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆంగ్లం అంటే భయం వద్దు

- ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధి రాంప్రదీప్

ప్రజాశక్తి - తిరువూరు

భాష అనేది భావ వ్యక్తీకరణ కోసమేనని, దీని కోసం పెద్ద పెద్ద పదాలు ఉపయోగించాల్సిన అవసరంలేదని, భయపడితే ఏ భాష నేర్చుకోలేమని, ఇందుకు ఇంగ్లీష్ భాష కూడా మినహాయింపు కాదని ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధి ఏం. రాంప్రదీప్ తెలిపారు. తిరువూరు మండలం మునకుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తాను రూపొందించిన క్లాస్ రూమ్ ఇంగ్లీష్ పుస్తకాన్ని పరిచయం చేసి మాట్లాడారు. అనంతరం వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు జి.రామకృష్ణ, ఆంగ్ల ఉపాధ్యాయిని ఏ.శారదా భాను, వ్యాయామ ఉపాధ్యాయిని బి. వేణి కృష్ణమ్మ పాల్గొన్నారు.



జెవివి ఎ.కొండూరు మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తిరువూరు

జెవివి ఎ.కొండూరు మండల నూతన అధ్యక్షులుగా జి.వంశీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్ రామ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జెవివి మండల మహాసభ జరిగింది. గౌరవాధ్యక్షులుగా పి.శోభన్ బాబు, ఉపాధ్యక్షులుగా జి.రమేష్, పి.లీల, కోశాధికారిగా బి.రమేష్, సమతా కన్వీనర్‌గా తేజస్విని, సహాయ కార్యదర్శులుగా ఎ.రవీంద్ర, కుమార్ మోహన్‌రావు, సామ్యూల్ ఎన్నికయ్యారు. ప్రధానవక్తగా హాజరైన జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ మాట్లాడుతూ నేటికి సమాజంలో అనేక మూఢ నమ్మకాలు ఉన్నాయని, వాటికి వ్యతిరేకంగా జెవివి పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ఆఫ్లలు బి. దుర్గారావు, ప్రజా సంఘాల నాయకు లు జె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కొండపల్లి మున్సిపాలిటీలో హైస్కూలు వద్ద నుంచి ఎర్ర బ్రిడ్జి హైవే వరకు రూ.43.45 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన కొండపల్లి మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ రోడ్డు నిర్మాణంతో అన్ని అవస్థలు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి రామ్మోహనరావు (గాంధీ), పాల్గొన్నారు.

పనిచేయకుండానే చేసినట్లు నమోదు

- ఒకే పనిని మూడు గ్రామాల ఎఫ్ఎలు రాసుకున్న వైనం
- మిషన్‌తో చేయించిన పనిని కూలీలు చేసినట్లు తప్పుడు నమోదు
- ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో బయటపడిన అవకతవకలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో కే.వి.ఎస్. రవికాంత్ అధ్యక్షతన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో డిఆర్పీలు, వి ఎస్ ఏ ల ద్వారా ఇంటింటికి తిరిగి సామాజిక తనిఖీ నిర్వహించారు. ప్రతి జాబ్ కార్డు హెూల్డర్ నుంచి ఈ బందం వివరాలు సేకరించి ఆ నివేదికను ఉన్నతాధి కారుల సమక్షంలో చదివి వినిపించారు. డిఆర్‌పి లు చదివిన నివేదిక ప్రకారం ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగాయి. బద్రిరాజుపాలెం, కుమ్మమూరు, గరికపర్రు, యాకమూరు, తోట్లవల్లూరు, వల్లూరు పాలెం, బొడ్డపాడు గ్రామాలలో భారీగా అవకతవకలు జరిగినట్లు, లక్షల్లో ఉపాధి హామీ డబ్బులు గోల్ మాల్ జరిగినట్లు నివేదిక చదివారు. గరికపర్రు గ్రామంలో ఒకే పనిని మూడు గ్రామాల వారు చేసినట్లు రాసుకున్నారు. కపిలేశ్వరపురం,మంటాడకు చెందినవారు గరికపర్రు వారు ఒకే పనికి సంబంధించిన మాస్టర్ రోల్ ను మూడు గ్రామాల వారు రాసుకోవడం గమనార్హం. ఎక్స్కవేటర్ మిషన్ తో తవ్వించిన కాలువ బోధులను సైతం ఉపాధి కూలీలు చేసినట్లు ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నమోదు చేయటం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రతి గ్రామంలోని ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ కిలోమీటర్ల మేర పనులు చేయకుండానే చేసినట్లు వర్క్ ఐడీలో నమోదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటం వలన ఒక్కరోజు పని చేసిన వారికి రూ. 9700 వేసిన దాఖలాలు నమోదు అయ్యాయి. చనిపోయిన వారికి సైతం పని చేసినట్టు మస్టర్ వేసి పేమెంట్ చేశారు. ఒకే పనిని రెండుసార్లు చేసినట్టు చూపారు. మాస్టర్ రోల్లో పనిచేసినట్లు కూలీల సంతకాలు వేలిముద్రలు లేకుండా పేమెంట్ చేశారు. మొత్తంగా చూస్తే ఉపాధి హామీ పథకంలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు ఏమి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. డ్వామ పిడి ఎన్. శివప్రసాద్ యాదవ్, అంబుడ్స్ మన్ పర్సన్ కె.వి. శ్రీనివాసరావు, డి ఎల్ డి ఓ రాజేష్, స్టేట్ పీఎం ఎం సునీల్ కుమార్ పాల్గొన్నారు.


సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు



కరకట్టను ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-మోపిదేవి : దివిసీమకు కృష్ణానది వరద ఉధతి కొనసాగుతున్న నేపథ్యంలో కరకట్టను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం మోపిదేవి మండలం ఉత్తర చిరువోల్లంకలో ఔట్ ఫాల్ స్లూయిజును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరిశీలించారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద నుంచి ఐదు లక్షలకు తగ్గకుండా వరద కొనసాగుతున్న పరిస్థితిలో అధికారులు అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రాజెక్టు కమిటీ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈఈ బీబీఎస్ గణపతి, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, జనసేన మండల అధ్యక్షులు, పీఏసీఎస్ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, బాదర్ల లోలాక్షు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు నరసింహ పురం రోడ్డులో ఉన్న హిందువుల శ్మశాన వాటిక అభివద్ధి పనులలో భాగంగా శ్మశాన వాటిక ముఖ ద్వారం వద్ద ఏర్పాటుచేసిన గేటుకు రిటైర్డ్ డిఎస్పి కోటగిరి ఉదయ భాస్కర్ సతీమణి కోటగిరి శ్రీదేవి రూ 40,000 విరాళాన్ని అందించారు. తన తల్లిదండ్రులు పండలనేని రామారావు- పండలనేని నాంచారమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు శ్రీదేవి తెలిపారు. శ్మశాన వాటిక అభివద్ధికి సహకారం అందించిన కోటగిరి శ్రీదేవికి శ్మశాన వాటిక అభివద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు.

వికలాంగులకు ఆర్థిక భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వికలాంగులకు ఆర్థిక భద్రత కల్పించాలని మండలంలోని మామిడికోళ్లకు చెందిన వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ స్టేట్ కన్వీనర్ బందెల కిరణ్‌రాజ్ కోరారు. శుక్రవారం దివ్యాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల స్త్రీ శిశు సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డిని కలిసి రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పెన్షన్ తొలగింపులను ఆపాలని వినతిపత్రాన్ని కిరణ్‌రాజ్ అందించారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియ పర్సంటేజ్‌ల తగ్గింపు తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. పింఛన్ తొలగింపు ప్రక్రియపై పునరాలోచన చేసి ప్రతి నెల యధావిధిగా ఒకటో తేదీ రోజు అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగునికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను నిర్లక్ష్యం చేస్తూ ఎన్నికల హామీలను నెరవేర్చకుండా విద్యారంగానికి ద్రోహం చేస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం విద్యార్థు ల సమస్యల పరిష్కారం కోరుతూ స్థానికంగా ఉన్న పలు విద్యాసంస్థల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం మండల తాసిల్దార్ కార్యాలయంలో విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15000 ఆర్థిక సహాయం అందిస్తానని ఎన్నికల సమయంలో ప్రకటించిన కూటమి ప్రభుత్వం కేవలం ఆరేడు వేల రూపాయలు ఇచ్చి సరిపుచ్చటం విద్యార్థులను మోసగించటమేనని అన్నారు. పిజి కోర్సులు చేసే విద్యార్థులు కూడా ఫీజు రియంబర్స్మెంట్ వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు వెంటనే మెస్ ఛార్జీలు చెల్లించాలని, పెరిగిన ధరలు కనుగు ణంగా కాస్మోటిక్ కింద రూమ్ 3000 చెల్లించాలని కోరారు. ఈనెల 25 లోపు తమ డిమాండ్లను పరిష్కరిం చుకుంటే కలెక్టరేట్లను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి హారిక పలువురు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి వినపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వయ్యారిభామ కలుపు నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల వారు వయ్యారి భామ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి సుధారాణి ఆధ్వర్యంలో ఘంటసాల పాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వయ్యారి భామ కలుపు మొక్క యాజమాన్యం, ఈ మొక్క వల్ల మానవ ఆరోగ్యంపై ఎలాంటి దుష్ఫలితాలు చూపిస్తుంది అనే విషయంపై గ్రామస్తులకు అవగాహన కలిగిస్తూ ఆ గ్రామంలో కొంతమేరకు వయ్యారి భామ మొక్కలను తొలగించి నాశనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి సుధారాణి గారు శాస్త్రవేత్తలు డా. బి. నవీన్, డా వి. మంజు వాణి, డా. కె. రేవతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



వయ్యారీ బామ కలుపుమొక్కపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ట్రాఫిక్ చక్రబంధంలో పామర్రు గఫార్ సెంటర్

ప్రజాశక్తి పామర్రు : పామర్రులోని స్థానిక గఫార్ సెంటర్లో అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల పాదాచారులకు సైతం రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ద్విచక్ర వాహనం కూడ వెళ్లలేని పరిస్థితి ఇక్కడ నెలకొంది. ప్రతి రోజు సాయంత్రం వేళలో ఈ పరిస్థితి ఉత్పన్న అవడంతో స్కూల్ నుంచి వచ్చే విద్యార్థుల బస్సులు వేరే మార్గంలో రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుడివాడ జాతీయ రహదారి నుండి పామర్రు గ్రామంలోకి వెళ్లే ప్రహదాన రహదారి ఈ సెంటర్ మీదుగా వెళుతుంది. ప్రధాన రహదారి లో ఉన్న దుకాణం దారులు తమ షటర్లను దాటి ముందుకు రావడంతో రహదారి విశాలత కొంతమేరకు తగ్గింది. అదే దుకాణానికి వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లమీద నిలపాల్సి రావడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. దీనికి తోడు చిరు వ్యాపారులు కూడా తమ స్టాండ్లను రోడ్లమీద ఏర్పాటు చేసుకుంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎవరు ఇష్టమొచ్చిన రీతిలో వారు వాహనాలను నిలుపు చేస్తున్నారు. దీంతో పాదాచారులకు సైతం ఈ రోడ్ల వెళ్లడానికి గాని గఫార్ సెంటర్ ను దాటడానికి గాని తీవ్ర ఇబ్బందిగా మారింది. తక్షణమే సంబంధిత అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పెన్షన్లు తొలగించడం అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - గుడివాడ : కూటమి ప్రభుత్వం పెన్షన్లు పరిశీలించకుండా తొలగించడం సరైన పద్ధతి కాదని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడివాడ పట్టణ పరిధిలో 258 పెన్షన్లకు నోటీసులు ఇచ్చారని, ఇందులో 15 వేల రూపాయలు పెన్షన్‌ని 6 వేల రూపాయలకు 8 మందికి మార్చారన్నారు. అలాగే 14 మందికి రూ.6000 ఇచ్చే పెన్షన్‌ను రూ.4000లకు మార్చారన్నారు. మిగిలిన పెన్షన్లు అన్ని ఇన్‌ఎలిజిబుల్ పెన్షన్‌ల కింద డిక్లేర్ చేయడం జరిగింది కాబట్టి ఇది చాలా దారుణ విషయమన్నారు. ఈ పెన్షన్‌లను ఒకటికి రెండుసార్లు ప్రభుత్వం పరిశీలించాలి కానీ పరిశీలించుకోకుండా మెడికల్ సదరన్ సర్టిఫికెట్లు వాళ్ళు ఎంక్వయిరీ చేపిచ్చి వాటిని బట్టి ఈ పెన్షన్‌లను హడావిడిగా ప్రభుత్వం రద్దు చేయటం అనేది చాలా దుర్మార్గం అన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మండలంలో ప్రభుత్వం చేపట్టిన వికలాంగుల పెన్షన్ వెరిఫికేషన్‌లో భాగంగా అర్హత ఉండి కూడా పెన్షన్ తొలగించిన వాటిని పునః పరిశీలన చేసి అర్హులైన వారికి వెంటనే మంజూరు చేయాలని సిపిఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా మండలంలో అర్హత కలిగిన వికలాంగులందరికీ పెన్షన్ తిరిగి పునరుద్ధరణ చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - గుడివాడ : మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదం జరిగి కుటుంబం రోడ్డున పడుతుందని రూరల్ ఎస్ఐ చంటిబాబు తెలిపారు. శుక్రవారం రూరల్ మండల పరిధిలోని దొండపాడు కాలువ వద్ద వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ లైసెన్స్ లేని వాహనాలు, వాహనాలకు సంబంధించి సిబుక్ లేని వారిపై కేసులు నమెదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో ఎఎస్ఐ చౌదరి, సిబ్బంది, పాల్గొన్నారు.

ముడా చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్ మట్టా ప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం కార్యాలయ అధికారులకు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ్ మాధవ్ టీం లో కీలక బాధ్యతలు నిర్వహించడానికి ఆహ్వానం అందడంతో ముడ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ కి అందించినట్లు తెలిసింది.

మార్క్‌ఫెడ్ అభివృద్ధికి కృషి : చైర్మన్

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా మార్క్ఫెడ్ ద్వారా రైతులకు మరిన్ని ప్రయోజనాలు కల్పించి సంస్థ అభివద్ధికి కృషి చేస్తామని చైర్మన్ కర్రోతు బంగారు రాజు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మార్క్ఫెడ్ చైర్మన్ నగరంలోని మార్క్ఫెడ్ కార్యాలయం, రైల్వే స్టేషన్ వద్ద గల మార్క్ఫెడ్ గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్క్ఫెడ్ చైర్మన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మచిలీపట్నంలో మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ కార్యాలయం, గోదాములు శిథిలావస్థకు చేరుకున్నాయని, సుమారు ఆరుకోట్ల రూపాయలతో వీటిని నిర్మించేందుకు బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. కష్ణా జిల్లాలో ఇప్పటివరకు 160 ప్రాథమిక వ్యవసాయ పరపతి సొసైటీ(పి.ఏ.సి. ఎస్)ల ద్వారా 12,627 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామన్నారు. అలాగే రైతు సేవ కేంద్రాల ద్వారా 392 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. ఈ పర్యటనలో మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, డి ఈ ఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదాం

- కలెక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ



జిల్లాలో అత్యంత ప్రాచుర్యం పొందిన కొండపల్లి ఖిల్లా, భవానీ ద్వీపం, గాంధీ హిల్, బీఆర్ అంబేద్కర్ స్మృతివనం, మొగల్రాజపురం గుహలు, మూలపాడు బటర్‌ఫ్లై పార్కు వంటి పర్యాటక ప్రాంతాలతోపాటు కనకదుర్గమ్మ దేవాలయం, గుణదల మేరీమాత, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం, వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, జగ్గయ్యపేట సమీపంలోని తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి ఆలయం వంటి అనేక ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలను పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. కలెక్టరేట్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాకి గేట్‌వే అయిన ఎన్‌టీఆర్ జిల్లాలో పర్యాటకులు, సందర్శకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో పర్యాటక, సాంస్కతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చేందుకు ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భవానీ ద్వీపాన్ని పర్యాటకులతో పాటు నగరవాసులు సందర్శించేందుకు వీలుగా వారాంతాల్లో వినోద, సాంస్కతిక కార్యక్రమాలతో పాటు వివిధ వర్గాల్లో ప్రతిభను వెలికితీసే పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రానున్న దసరా మహెూత్సవాల్లో విజయవాడ ఉత్సవాన్ని నిర్వహించనున్నామని, ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు విజయవాడ నగరానికి వన్నెతెచ్చే రీతిలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప పాల్గొన్నారు.

విస్తృత నెట్‌వర్క్‌తో సామ్‌సంగ్ టీవీ ప్లస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఈటీవీ నెట్‌వర్క్ నుండి నాలుగు కొత్త ఛానళ్లను తన పెరుగుతున్న కంటెంట్ పోర్ట్‌ఫోలియోకు జోడిస్తున్నట్లు శాంసంగ్ ప్రకటనల మద్దతు గల ఉచిత స్ట్రీమింగ్ టీవీ సర్వీస్ సామ్‌సంగ్ టీవీ ప్లస్ ఇంచార్జి కె.వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భాగస్వామ్యం సామ్‌సంగ్ టీవీ ప్లస్ 150 కంటే ఎక్కువ వేగవంతమైన ఛానెల్‌ల బలమైన కేటలాగ్‌ను సుసంపన్నం చేస్తుందని తెలిపారు. వినియోగదారులకు అద్భుతమైన కొత్త శ్రేణి అధిక నాణ్యత, వైవిధ్యభరిత కంటెంట్‌ను అందిస్తుందన్నారు. శాటిలైట్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా శాంసంగ్ స్మార్ట్ టీవీల ద్వారా మంచి కార్యక్రమాలను అందిస్తుందని తెలిపారు. అందులో విస్తృతమైన కంటెంట్ లైబ్రరీలో వార్తలు, సంగీతం, యువతకు ప్రాధాన్యం ఇచ్చే వినోదం, కామెడీ ఉన్నాయని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారితో సహా తల్లి మృతి

ప్రజాశక్తి-కంచికచర్ల

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు నెలల చిన్నారితోపాటు ఆమె తల్లి మృతి చెందిన సంఘటన కంచికచర్ల మండలం కీసర గ్రామంలో శుక్రవారం జరిగింది.. పోలీసులు అందించిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన నాగబర్తి చైతన్య (20), తన మూడు నెలల పసికందు అద్విక్‌ను తీసుకొని నిద్ర చేయటానికి తన పిన్ని ఇంటికి కీసర వచ్చింది. కీసర టోల్గేట్ వద్ద బస్సు దిగిన ఆమె తన పిన్ని రేణుకకు ఫోన్ చేసి సమాచారం అందించింది. రేణుక తన ఇంటి పక్కన ఉన్న శ్రీరామచంద్రమూర్తిని తన చెల్లెల్ని తీసుకురావాలని సాయం కోరింది. రామచంద్రమూర్తి తన ద్విచక్ర వాహనంపై టోల్గేట్ వద్ద ఉన్న చైతన్యను, ఆమె కుమారుడిని ఎక్కించుకొని వస్తుండగా కీసర సెంటర్‌కు వచ్చేసరికి విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే పసికందైన అద్విక్ మతి చెందాడు. తల్లి చైతన్య, శ్రీరామచంద్రమూర్తి ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చైతన్య మృతి చెందింది. ఈ ఘటనపై కంచికచర్ల ఎస్సై విశ్వనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉత్సాహంగా అంతర్జాతీయ చెస్ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

పిబి సిద్ధార్థ కాలేజీలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఎస్ఆర్ఆర్ ఫీడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు రెండవ రోజు శుక్రవారం ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. పోటీలలో భాగంగా భారతదేశంతో పాటు కెనడా, ఇంగ్లాండ్, కెన్యా, అమెరికా, సౌత్ ఆఫ్రికా దేశాల క్రీడాకారులు మొత్తంగా 409 మంది, అందులో 28 మంది అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు ఫణికుమార్ తెలిపారు. మూడవ రౌండ్ ముగిసేసరికి రాష్ట్ర క్రీడాకారులు చిన్నం వైష్ణవి, కావ్య శ్రీ, హేమల్ వర్షన్, గొర్లి నైనా, గిరిధర్ మూడేళ్ల, సీత సాగర్, లక్ష్మణరావు, కోట కల్పక్ హర్ష కీర్తన్, సింహాద్రి సాయి హృషికేష్‌లతో పాటు కెన్యా నుంచి యస్మిత్ రామ్ చైకం, 27 మంది క్రీడాకారులు కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర ఒరిస్సా, వెస్ట్ బెంగాల్ నుంచి 3 పాయింట్లతో ముందంజలో ఉన్నారని తెలిపారు. నాల్గో రౌండ్‌లో అద్విక్ అభినవ్ కృష్ణ, బాలకిషన్, సంతోష్ హరి హరన్, తన్విష్ రెడ్డి, అద్విక్ లెనిన్‌లు అద్విక్ అమిత్ అగర్వాల్, సారిక దర్భ, విజయ్ శ్రీరామ్, వినయ్ కుమార్, సీతాసాగర్ తలపడుతున్నారని పేర్కొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడ వన్‌టౌన్లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో కళాశాల మొదట సంవత్సరం చదువుచున్న విద్యార్థులకు శుక్రవారం య్యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ సిపి వెస్ట్ దుర్గారావు, కొత్తపేట ఎస్ఐ కొండలరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తమ ఉజ్వలమైన భవిష్యత్తు కోసం రాగింగ్‌కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ



శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లను ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు శుక్రవారం పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు సలహాలు అందించారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమీషనర్, ఇతర పోలీస్ అధికారులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చే సందర్శకుల కోసం మునిసిపల్ ఆఫీస్ వద్ద, హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఏర్పాటు చేయు హెూల్డింగ్ ఏరియాలను పరిశీలించి ఏవిధంగా బారిగేటింగ్ చేయ్యాలి భక్తులు లోనికి వెళ్ళడానికి బయటకు రావడానికి ఏర్పాటు చేయు మార్గాల గురించి టెంపుల్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వారికి తగు సూచనలు చేశారు. అదేవిధంగా రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ పరిసరాలు, పద్మావతి ఘాట్, సీతమ్మ వారి స్నాన ఘాట్, భవాని, పున్నమి ఘాట్లను, వినాయకుడి గుడి వద్ద నుండి అమ్మవారి టెంపుల్ వరకు భక్తుల దర్శన నిమిత్తం రావడానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు అందించారు. క్యూ లైన్లు, ఘాట్లు , పార్కింగ్ ప్రదేశాలు, ప్రసాదం కౌంటర్లు, ఇతర ప్రదేశాలలో ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు తగు సూచనలను చేశారు.

కెన్ స్టార్ నూతన ఎయిర్ కూలర్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



ఐదేళ్ల వారంటీతో మొట్టమొదటి శక్తి సామర్థ్యం గల 5-స్టార్ రేటెడ్ ఎయిర్ కూలర్ శ్రేణిని పరిచయం చేసినట్లు కెన్‌స్టార్స్ ఈఓ సునీల్ జైన్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన ఉత్పత్తిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేకమైన సాంకేతిక ఆవిష్కరణ, డిజైన్‌తో కూలింగ్‌ను పునర్నిర్వచించిన 'కెన్‌స్టార్ పవర్ ఆఫ్ 5' ఆకట్టుకుంటుందని తెలిపారు. ఈ కొత్త శ్రేణి ఎయిర్ కూలర్లు అత్యాధునిక సాంకేతికతతో శక్తి సామర్థ్యాన్ని మిళితం చేస్తాయని, విద్యుత్‌ను ఆదా చేస్తూ అత్యుత్తమ పనితీరును నిర్ధారిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెన్‌స్టార్ సేల్స్ హెడ్ సంతోష్ భామ్రే పాల్గొన్నారు.

సిఇవి స్టేజ్ -వి బ్యాక్ లోడర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సిఎఎస్ఇ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ సంస్థ నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సిఈవి స్టేజ్ 5-లోడర్ బ్యాక్‌హెూస్, కంపాక్టర్‌లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సలబ్ చతుర్వేద తెలిపారు . నూతన ప్రొడక్ట్స్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతూ లోడర్ 770ఎన్ఎక్స్‌ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.. అధిక-పనితీరు గల ఇంజనీరింగ్‌ను స్థిరత్వంతో కలపడం, వినియోగదారులు అభివద్ధి చెందుతున్న పరిశ్రమ ప్రమాణాలు, పర్యావరణ నిబంధనలకు సిద్ధంగా ఉన్నారని నిర్ధారించడంపై కంపెనీ దష్టి పెట్టి కొత్త మోడళ్ల తీసుకువచ్చినట్లు తెలిపారు. సిఎఎస్ఈ విజయవాడ డీలర్‌షిప్ శ్రీనివాస ఎడిఫైస్ పవర్ సర్వీసెస్‌లో, సిఎస్ఈ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంపి మేనేజింగ్ డైరెక్టర్ శలభ్ చతుర్వేది, డీలర్ ప్రిన్సిపాల్ వైవి మన్మోహన్‌తో సహా సీనియర్ కంపెనీ నాయకుల సమక్షంలో ఈ పరికరాలను ఆవిష్కరించారు.

ప్రజల క్షేమమే ప్రధాన ధ్యేయం

- ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ సిటీ



ప్రజల క్షేమమే ప్రధాన ధ్యేయమని, విజయవాడ నగరంలోని మేజర్ అవుట్ ఫాల్ డ్రైన్‌లు అన్నిటికీ ఖచ్చితంగా రైలింగ్ పెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం తన పర్యటనలో భాగంగా వన్‌టౌన్ కొత్తపేట, పంజా సెంట్రల్, డ్రైన్ వీధి, సుబ్బరామయ్య వీధి, గాంధీహిల్, గవర్నర్పేట వెహికల్ డిపో ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న అన్ని మేజర్ ఔట్‌ఫాల్ డ్రైన్‌లకు రైలింగ్ వేయాలని, నగరంలో ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు వెంటనే తీసుకోవాలని తెలిపారు. పాడైపోయిన గ్రేటింగ్స్ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తూ, నగరంలోని అన్ని గ్రేటింగ్స్లు ఎటువంటి మరమ్మతులు లేకుండా ఉండాలని అధికారులను ఆదేశించారు. గాంధీహిల్ వద్ద ఎక్స్కలేటర్ ద్వారా జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. గవర్నర్‌పేట వెహికల్ డిపో వెనుకాల డ్రైనేజీ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. పంపింగ్ కెపాసిటీ తక్కువ ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, దాన్ని పంపించే సామర్థ్యం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యనారాయణ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.